క్లుప్తంగా

ముమ్మరంగా వాహన తనిఖీలు



కాకినాడ-కోటిపల్లి రహదారిపై తనిఖీలు చేస్తున్న ఎస్సై మోహన్‌కుమార్, సిబ్బంది

కాజులూరు: రోడ్డుపై ప్రయాణించే ప్రయాణికులు ప్రమాదాలకు గురి కాకుండా ఉండేందుకే ట్రాఫిక్ నిబంధనలను అమలు చేస్తున్నట్లు గొల్లపాలెం ఎస్సై ఎం మోహన్‌కుమార్ అన్నారు. ఆదివారం కాకినాడ- కోటిపల్లి రహదారిపై శలపాక జంక్షన్ వద్ద ఎస్సై మోహన్‌కుమార్, పోలీసు సిబ్బంది నాకాబంది నిర్వహించారు. రికార్డులు సక్రమంగా లేని వాహనదారులకు జరిమానాలు విధించారు.

శ్రీరామకృష్ణ కుటుంబానికి పరామర్శ



అప్పలస్వామి చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న సూర్యప్రకాశ్ తదితరులు

రామచంద్రపురం రూరల్: మండలంలోని యనమదల గ్రామ ఎంపీటీసీ సభ్యుడు నురుకుర్తి శ్రీరామకృష్ణ కుటుంబ సభ్యులను నియోజకవర్గ వైఎస్సార్ సీపీ కోఆర్డినేటర్ పిల్లి సూర్యప్రకాశ్ ఆదివారం పరామర్శించారు. ఎంపీటీసీ తండ్రి నురుకుర్తి అప్పలస్వామి(81) గత నెల 31న అనారోగ్యంతో మృతి చెందారు. ఆయనకు భార్య సూర్యకాంతం, కుమారుడు శ్రీరామకృష్ణ, కుమార్తె పాలిక దేవి ఉన్నారు. వారిని ఆదివారం సూర్యప్రకాశ్‌తో పాటు సర్పంచ్‌లు పంపన వీరవెంకటరమణ, కట్టా గోవిందు, డాక్టర్ శ్యామ్, పార్టీ నాయకులు నేదూరి జగ్జీవన్‌రావు(జగన్), గ్రామ పెద్దలు పరామర్శించారు.

కృష్ణమూర్తికి పరామర్శ

కపిలేశ్వరపురం: మాతృ వియోగంతో బాధపడుతున్న మండల సాగు సలహా మండలి మాజీ చైర్మన్, వైఎస్సార్ సీపీ నాయకుడు పుట్టా కృష్ణమూర్తిని నల్లూరులోని ఆయన నివాసంలో ఆదివారం పార్టీ రైతు విభాగం రాష్ట్ర కార్యదర్శి, మున్సిపల్ కో ఆప్షన్ సభ్యులు రెడ్డి రాధాకృష్ణ పరామర్శించారు. ఆయన వెంట ఎంపీటీసీ సభ్యుడు అడ్డాల శ్రీనివాస్, పీఏసీఎస్ మాజీ చైర్మన్ పెంకే గంగాధర్, నాయకులు మార్ని పూసబ్బు, అతికెల శంభులింగం, కుడుపూడి రమణ, సుబ్బారావు, గోవిందు, పట్టాభి ఉన్నారు.

వెంకటస్వామికి నివాళి



వెంకటస్వామి చిత్రపటానికి నివాళులర్పిస్తున్న నేతలు

రామచంద్రపురం: శెట్టిబలిజ సంఘం నేత, దొమ్మేటి వెంకటరెడ్డి మనుమడు దొమ్మేటి వెంకటస్వామి(బాబూరావు)కి తాలూకా శెట్టిబలిజ సంఘం ఆధ్వర్యంలో ఘనంగా నివాళులర్పించారు. పట్టణంలో జరిగిన కార్యక్రమంలో శెట్టిబలిజ సంఘం నేతలు కట్టా సూర్యనారాయణ, నరాల ఏడుకొండలు, పాలిక అప్పారావు, కడలి రామకృష్ణ, వాసంశెట్టి లక్ష్మీనారాయణ, ఏపీబీడీసీ మాజీ డైరెక్టర్ వాసంశెట్టి శ్యాం, పిల్లి సత్యనారాయణ, పెంకే వీరరాఘవులు, టీకుమూడి సత్యనారాయణ తదితరులు వెంకటస్వామి చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. శెట్టి బలిజ సంఘానికి ఆయన చేసిన సేవలను కొనియాడారు.

సూర్యభగవానుడికి ప్రత్యేక పూజలు



అంబాజీపేటలో పూజలు చేస్తున్న భక్తులు

అంబాజీపేట: స్థానిక వాసవీ కన్యకాపరమేశ్వరి అమ్మవారి ఆలయంలో వసంత పంచమి, రథసప్తమిలను పురస్కరించుకుని సూర్యభగవానుడికి ఆదివారం ప్రత్యేక పూజలు చేశారు. ఆలయ అర్చకులు చంద్రమౌళీ ధనూష్ శర్మ ఆధ్వర్యంలో సూర్యునికి పూజలు చేశారు. రథసప్తమిని పురస్కరించుకుని మూడు రోజులు ప్రత్యేక పూజలు జరపనున్నట్లు ఆర్యవైశ్య సంఘ నాయకులు తెలిపారు. ఆలయ ప్రాంగణంలో ఆర్యవైశ్య మహిళలు ఆదిత్య హృదయం సహస్రం చేశారు.

ఉచిత వైద్య శిబిరం

అయినవిల్లి: మండలంలోని ఎస్.మూలపాలెంలో ఆదివారం ఉచిత దంత వైద్యశిబిరం నిర్వహించారు. సూర్యప్రభ డెంటల్ ఆస్పత్రి ఆధ్వర్యంలో ఈ వైద్య శిబిరం నిర్వహించారు. రోగులకు ఉచితంగా మందులు అందజేశారు.

పందెం మత్తులో భవిత ఛిద్రం!

- గ్రామాల్లో యథేచ్ఛగా కొనసాగుతున్న కోడి పందాలు, గుండాటలు
- సంక్రాంతి ముగిసినా జోరు తగ్గని వైనం
- సర్వం ఒడ్డి నష్ట పోతున్న జూదరులు
- రోడ్డున పడుతున్న కుటుంబాలు
- చోద్యం చూస్తున్న అధికారులు



కాజులూరు మండలం ఆర్యావటంలో కోడి పందాల నిర్వహణ

కాజులూరు: సంక్రాంతి పండగ వచ్చిందంటే ఉభయ గోదావరి జిల్లాలలో కోడి పందాలు జోరుగా సాగుతుంటాయి. గ్రామాలలో వీటి నిర్వహణకు అనుమతులు ఇవ్వొద్దని ఎక్కడ నిర్వహించినా కఠిన చర్యలు తీసుకోవాలని కోర్టులు పోలీసులకు ఆదేశాలు జారీ చేశాయి. అయినప్పటికీ పండగ దినాలలో పోలీసులు కాస్త అటూ ఇటూ చూసీ చూడనట్టు వదిలేయటం.. ఆ మూడు రోజులు పందాలు హుందాగా సాగిపోవటం పరిపాటే.

సంక్రాంతి ముగిసిన తర్వాత జిల్లాలో కోడి పందాల నిర్వహణ తగ్గుముఖం పడుతున్నప్పటికీ రామచంద్రపురం నియోజకవర్గంలోని కాజులూరు, కె గంగవరం మండల గ్రామాలలో మాత్రం యథావిధిగా జరుగుతున్నాయి. సంక్రాంతి పండగ ముగిసి సుమారు 15 రోజులు కావస్తున్నా పలు గ్రామాలలో కోడి పందాల జోరు తగ్గటం లేదు. కాజులూరు మండలంలో గొల్లపాలెం, ఆర్యావటం, పల్లిపాలెం, కుయ్యేరు, కోలంకలలోనూ, కె గంగవరం మండలం మసకపల్లి, పెకేరు తదితర గ్రామాలలో పొలాల మధ్య దిమ్మలపై పందాల రాయుళ్లు యథేచ్ఛగా కోడి పందాలు నిర్వహిస్తూనే ఉన్నారు. గత మూడు రోజుల క్రితం మండలంలోని గొల్లపాలెం శివారు ధన మహాలక్ష్మీ కాలనీ సమీపంలో కోడి పందాలు నిర్వహిస్తుండగా పోలీసులు దాడులు జరిపి నలుగురిని అదుపులోనికి తీసుకున్నారు. వారిని అరెస్టు చేసి కోర్టుకు తరలించారు.

గుండాట ఏర్పాటుకు రూ.2 కోట్ల వేలం

మండల గ్రామాలలో కోడి పందాలు నిర్వహించేందుకు అనువైన ప్రదేశాలు ఉండటంతో వాటిని ఉపయోగించుకుని పందెం రాయుళ్లు పేట్రేగిపోతున్నారు. స్థావరాలలో పందాలతో పాటు గుండాట, పేకాట తదితర జూదాలు నిర్వహిస్తున్నారు. దీంతో లక్షలాది రూపాయలు చేతులు మారుతుండగా పలువురు అమాయకులు సర్వం ఒడ్డి నష్టపోతున్నారు. ఈ ఏడాది సంక్రాతి పండగను పురస్కరించుకుని కోడిపందాల స్థావరాలలో గుండాట ఏర్పాటుకు నిర్వాహకులు బహిరంగ వేలం నిర్వహించగా మండల గ్రామాలలో రూ. రెండు కోట్ల పైబడి వేలంపాట జరిగింది. ప్రస్తుతం పందాల స్థావరాలలో కోడి పందాలతో పాటు గుండాట జోరుగా కొనసాగుతుంది. గుండాట, కోడి పందాల కోసం ఆస్తిపాస్తులు, భార్యల మెడలో తాళిబొట్లు సైతం పణంగా పెడుతూ పలువురు సర్వం కోల్పోతున్నారు. ఈ కోడి పందాలలో తరచూ ఘర్షణలు చోటు చేసుకుంటూ గ్రామాలలో వర్గ విభేదాలు తలెత్తుతున్నాయి. పందెం రాయుళ్ల నుంచి అందుతున్న మామూళ్ల మత్తుతో అధికార యంత్రాంగం ఏమీ పట్టనట్టు వ్యవహరిస్తోందనే ఆరోపణలు ఉన్నాయి. కనీసం ఇప్పటికైనా గ్రామాలలో కోడి పందాలు జరగకుండా అధికారులు తగిన చర్యలు తీసుకోవాలని మండల పరిధిలోని పలు గ్రామాల ప్రజలు, మహిళలు కోరుతున్నారు.



పోలీసుల అదుపులో గొల్లపాలెం కోడి పందాల నిర్వాహకులు

దాడులు నిర్వహిస్తున్నాం

గ్రామాల్లో కోడి పందాలు, గుండాట, పేకాట నిర్వహణ వెనుక ఎంతటి వారున్నా ఉపేక్షించేది లేదు. ముఖ్యంగా కోడి పందాలపై గట్టి నిఘా పెట్టాం. ఎప్పటికప్పుడు దాడులు నిర్వహిస్తున్నాం. పందాలకు బానిసలుగా మారి కేసుల పాలై యువత జీవితాలను నాశనం చేసుకోవద్దు.

ఎం.మోహన్ కుమార్, ఎస్సై, గొల్లపాలెం.

ప్రతిభావంతులకు ప్రోత్సాహకాలు



బహుమతులు పొందిన విద్యార్థులతో చైర్‌పర్సన్ శ్రీదేవి, జీవీరావు

రామచంద్రపురం: ప్రతిభ గల విద్యార్థులను ప్రోత్సహించడానికి మోడరన్ అధినేత డాక్టర్ జీవీరావు చేస్తున్న కృషి అభినందనీయమని మున్సిపల్ చైర్‌పర్సన్ గాధంశెట్టి శ్రీదేవి అన్నారు. ఇటీవల మోడరన్ జూనియర్ కాలేజీ ఆధ్వర్యంలో ఉమ్మడి తూర్పు గోదావరి జిల్లా వ్యాప్తంగా స్కాలర్‌షిప్ కం అడాప్షన్ టెస్ట్ నిర్వహించారు. ఈ పరీక్షలో ఉత్తమ ప్రతిభ చాటిన విద్యార్థులకు మోడరన్ విద్యా సంస్థల ప్రాంగణంలో ఆదివారం అవార్డుల ప్రదానోత్సవం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి చైర్‌పర్సన్ శ్రీదేవి ముఖ్య అతిథిగా హాజరై విజేతలకు బహుమతి ప్రదానం చేశారు. అనంతరం మోడరన్ అధినేత జీవీరావు మాట్లాడుతూ గ్రామీణ ప్రాంతాల్లో విద్యార్థులకు ప్రోత్సాహాన్ని ఇచ్చేలా మోడరన్ విద్యా సంస్థ కృషి చేస్తుందన్నారు. ఇంటర్ కాలేజీ ప్రిన్సిపాల్ సీహెచ్ రాజేష్, డిగ్రీ కాలేజీ ప్రిన్సిపాల్ పి వెంకటేశ్వర్లు, జిల్లా ఆప్సా అధ్యక్షుడు డి.సత్తిబాబు, వైస్ ప్రిన్సిపాల్ పీఎస్ ప్రకాష్, అకాడమిక్ అడ్వైజర్ సీహెచ్ శ్రీనివాస్, మ్యాథ్స్ ఫ్యాకల్టీ సతీష్ తదితరులు పాల్గొన్నారు.

ద్రాక్షారామలో సాహితీ సంబరాలు

భాగవత పద్యాలతో హోరెత్తిన ప్రాంగణం



సాహితీ పోటీల్లో గెలుపొందిన విద్యార్థులకు బహుమతులు అందజేస్తున్న నిర్వాహకులు

రామచంద్రపురం రూరల్: ప్రముఖ సాహితీ వేత్త బీఎస్ నెహ్రూ 12వ వర్ధంతిని పురస్కరించుకుని నెహ్రూ సాహితీ సమితి ఆధ్వర్యంలో ఏటా మాదిరిగానే సాహితీ సంబరాలు నిర్వహించారు. రెండు రోజులుగా జరుగుతున్న పద్య పఠనం, సాహిత్య సమాహారం, సాహిత్య సమాహార ప్రహేళిక(క్విజ్) పోటీలలో ద్రాక్షారామ పరిసర గ్రామాల నుంచి 10 పాఠశాలల విద్యార్థులు ఉత్సాహంగా పాల్గొన్నారు. విశ్రాంత తపాలా శాఖ ఉద్యోగి బీబీఎస్ తిలక్, సాహితీ సమితి గౌరవాధ్యక్షురాలు భాగవతి అంజనీదేవి, విశ్రాంత ప్రధానోపాధ్యాయులు ఎంకే విశ్వనాథం, పోచినపెద్ది స్వరాజ్యలక్ష్మి న్యాయ నిర్ణేతలుగా వ్యవహరించారు. ఆవరణ మొత్తం భాగవత పద్యాలతో హోరెత్తింది. పోటీలలో గెలుపొందిన విద్యార్థులకు బహుమతులు అందజేశారు. ఈ సందర్భంగా కవయిత్రి తెలగాని మెహర్ సుజాత మాట్లాడుతూ చిన్నారుల్లో సాహిత్య అభిలాషను పెంపొందిస్తున్న ఈ సాహితీ యజ్ఞం నిర్విఘ్నంగా కొనసాగాలని ఆకాంక్షను వెలిబుచ్చారు. కార్యక్రమంలో ద్రాక్షారామ జెడ్పీ హైస్కూల్ ప్రధానోపాధ్యాయురాలు వాడ్రేవు రత్న పద్మావతి, సాహితీ సమితి కార్యదర్శి భాగవతి సుబ్బారావు, యువ కార్యదర్శి పోచినపెద్ది గణేష్, ప్రచార సమన్వయకర్త పోచినపెద్ది విఠల్, మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ దామిశెట్టి గంగా పురుషోత్తం, టేకుమూడి సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

గుర్తుకొచ్చిన మధుర జ్ఞాపకాలు



సందడి చేస్తున్న 2002-03 బ్యాచ్ విద్యార్థులు

మండపేట: స్నేహమేరా జీవితం..స్నేహమేరా శాశ్వతం అంటూ పూర్వ విద్యార్థులంతా ఆత్మీయ అలింగనాలు చేసుకున్నారు. ఒకరి నొకరు పలకరించుకుని పరవశించి పోయారు. తరగతి గదిలో నాటి మధుల జ్ఞాపకాలను గుర్తు చేసుకుంటూ ఆనంద పరవశులయ్యారు. పట్టణంలోని జవహర్ లాల్ మున్సిపల్ హైస్కూల్‌లో 2002-03 విద్యా సంవత్సరంలో పదో తరగతి చదువుకున్న విద్యార్థుల కలయికకు మారేడుపాక మైత్రీవనం వేదికగా మారింది. ఏటా ఇలానే అంతా ఓ చోట చేరాలని నిశ్చయించుకున్నారు. రోజంతా ఆనందంగా గడిపారు.

సీసీ రోడ్డుకు వాటరింగ్ పనులు

కాజులూరు: గొల్లపాలెం-కుయ్యేరు రహదారిలో నూతనంగా నిర్మిస్తున్న సీసీ రోడ్డుపై వాటరింగ్ చేసేందుకు అధికారులు ఎట్టకేలకు చర్యలు చేపట్టారు. వైఎస్సార్ సీపీ అధికారంలో ఉండగా నాటి మంత్రి చెల్లుబోయిన వేణుగోపాలకృష్ణ హయాంలో గొల్లపాలెం- కుయ్యేరు రహదారి నిర్మాణానికి రూ .37 కోట్ల నిధులు మంజూరయ్యాయి. ఈ నిధులతో రోడ్డు మధ్యలో పలు కల్వర్టులు, వంతెనలు పునర్నిర్మించిన అధికారులు మూడున్నర మీటర్ల వెడల్పు గల రోడ్డును ఏడు మీటర్ల మేర వెడల్పు చేశారు. ఎన్నికల ముందు నిలిచిపోయిన పనులు ఎట్టకేలకు ఇటీవల పునః ప్రారంభమయ్యాయి. ప్రస్తుతం రోడ్డు ముఖ ద్వారమైన గొల్లపాలెంలో అధికారులు సీసీరోడ్డు నిర్మిస్తున్నారు. అయితే పనులు జరిగే సమయంలో కాంట్రాక్టరు, సిబ్బంది మినహా అధికారులెవ్వరూ లేకపోవడంతో కాంట్రాక్టరు నాణ్యతకు తిలోదకాలు ఇస్తున్నారని స్థానికులు ఆరోపిస్తున్నారు. సీసీ రోడ్డు నిర్మించిన తర్వాత కొన్ని రోజులు రోడ్డుపై గడ్డి కప్పి నిత్యం నీటితో తడపాల్సి ఉండగా కాంట్రాక్టరు ఎటువంటి వాటరింగ్ చేయకుండా వదలి వేయటంపై స్థానికులు మండిపడ్డారు. దీనిపై గత నెల 29వ తేదీన సాక్షి పత్రికలో 'రోడ్డు నిర్మాణంలో నాణ్యత పాటించాలి' అనే శీర్షికన కథనం ప్రచురితమైంది. దీనిపై స్పందించిన అధికారులు నూతనంగా నిర్మించిన సీసీ రోడ్డుపై నీరు నిలిపేందుకు క్వారీ బూడిదతో మడులు ఏర్పాటు చేశారు.



గొల్లపాలెం- కుయ్యేరు రహదారిలో నిర్మిస్తున్న సీసీ రోడ్డుపై వాటరింగ్ చేసేందుకు ఏర్పాటు చేసిన మడులు

కేంద్ర బడ్జెట్‌లో రాష్ట్రానికి తీరని అన్యాయం

పీడీఎస్‌యూ రాష్ట్ర సహాయ కార్యదర్శి సిద్దు

రామచంద్రపురం: కేంద్రంలోని నరేంద్ర మోదీ సర్కారుకు ఏపీ అంటే ఎంత చిన్నచూపో మరోసారి పార్లమెంట్ సాక్షిగా ఈ ఏడాది బడ్జెట్ రుజువు చేసిందని పీడీఎస్‌యూ రాష్ట్ర సహాయ కార్యదర్శి బి.సిద్దు పేర్కొన్నారు. ఆదివారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ గత బడ్జెట్‌లో మాదిరిగానే ఈసారి సైతం కనీసం ఆంధ్రప్రదేశ్ అనే పదమే ఉచ్ఛారణకు నోచుకోలేదన్నారు. ఈ బడ్జెట్‌లోనైనా కేంద్ర ప్రభుత్వం ఆంధ్రప్రదేశ్ వైపు కన్నెత్తి చూస్తుందేమో అని ఐదు కోట్ల మంది ప్రజలు ఎదురు చూశారన్నారు. కానీ అందరి ఆశలపై కేంద్ర ప్రభుత్వం మళ్లీ నీళ్లు చల్లిందన్నారు. ఏపీకు ఐఐటీ, ఐఐఎం, ఐసర్, ఎన్ఐడీ, ట్రిపుల్ ఐటీ, గిరిజన విశ్వ విద్యాలయం, పెట్రో విశ్వవిద్యాలయం వంటి వాటిల్లో ఏ ఒక్కటీ ఇవ్వకపోవడం ఇక్కడి విద్యార్థులు, యువత, వారి తల్లిదండ్రులను అన్యాయం చేయడమేనని అన్నారు. దేశ అత్యున్నత చట్టసభలో హామీ ఇచ్చిన విభజన హక్కులను సైతం కేంద్ర ప్రభుత్వం నెరవేర్చకపోవడం అత్యంత దుర్మార్గమన్నారు. డబుల్ ఇంజిన్ సర్కార్‌తో ఎన్నో ప్రయోజనాలు ఉంటాయని ఎన్నికల్లో చెప్పిన ఈ కూటమి ప్రభుత్వం కేంద్ర బడ్జెట్‌లో రాష్ట్ర సమస్యలను ఎక్కడా పట్టించుకున్న దాఖలాలు లేవని విమర్శించారు. కడప ఉక్కు ఫ్యాక్టరీ, వ్యవసాయ రంగానికి అధిక నిధులు, రాయలసీమ, ఉత్తరాంధ్రలో వెనుకబడ్డ ప్రాంతాలకు ప్రత్యేక ప్యాకేజీ, రాజధాని నిర్మాణం కోసం మిగులు నిధులు, అమరావతి మెట్రో, విశాఖ మెట్రో వంటి హామీలు ఇన్నాళ్లయినా అమలు చేయని బీజేపీని ఇకపై రాష్ట్ర ప్రజలు నమ్మరన్నారు. కేవలం బీజేపీ పాలిత రాష్ట్రాలకు మాత్రమే పెద్దపీట వేసి, బడ్జెట్లో ఇతర రాష్ట్రాలకు అన్యాయం చేయడం పద్ధతి కాదన్నారు.

శృతి మించుతున్న మందుబాబుల ఆగడాలు

- జనావాసాల్లో తాగి, చిందేస్తున్న వైనం
- అసాంఘిక కార్యకలాపాలకు నిలయాలుగా లే అవుట్‌లు

మండపేట: కూటమి ప్రభుత్వం పుణ్యమా అని ఎక్కడ పడితే అక్కడ మద్యం ఏరులై పారుతుండడంతో మందుబాబులు ఆగడాలు ఎక్కువయ్యాయి. గ్రామం వెలుపల ఉండాల్సిన మద్యం షాపులు ప్రైవేటు పరం కావడంతో జనావాసాల్లోకి తీసుకురావడంతో వారి వ్యాపారం మూడు పువ్వులు, ఆరు కాయలుగా బాగానే సాగుతోంది. నివాస ప్రాంతాలకు చేరువలో ఉండడంతో ప్రజలకు మాత్రం తిప్పలు తప్పటం లేదు. బురుగుంట చెరువు, గొల్లపుంత రోడ్డు, మున్సిపల్ కార్యాలయం సమీపంలో నిత్యం వందలాది మంది సంచరిస్తుంటారు. ఇలాంటి ప్రాంతాల్లో మద్యం దుకాణాలు వెలియడంతో ప్రజలకు ఇబ్బందికరంగా మారింది. గొల్లపుంత రోడ్డులో అయితే మరీ దారుణంగా ఉంది. ఉదయం నుంచి సాయంత్రం వరకూ పనీపాట లేని కొంతమంది కుర్రకారు, మందు ప్రియులు అదే పనిగా సంచరిస్తున్నారు. కాలనీ రోడ్డులో బైక్‌లపై వేగంగా వెళుతూ జనాలను భయభ్రాంతులకు గురి చేస్తున్నారు. ఇదే రోడ్డులో అనేక లే అవుట్లు ఉన్నాయి. ఈ రోడ్డులో ఖాళీ స్థలాలు, గొడ్డు కాలువ వంతెన మందు బాబులకు నిలయంగా మారింది. స్థానికులు అక్కడ నివాసముండాలంటేనే భయపడే పరిస్థితి నెలకొంది. ప్రశ్నించిన వారిపై తిరగ బడుతున్నారు. మద్యం సేవించి ఘర్షణలకు దిగుతున్నారు. గొల్లపుంత రోడ్డు నుంచి కాలనీలోకి వెళ్లే రోడ్డు పక్కన కూర్చొని విచ్చలవిడిగా మద్యం సేవిస్తున్నారు. ఈ రోడ్డు వెంట ఆడపిల్లలు, పొట్టకూటికి పనుల్లోకి వెళ్లే మహిళలు, విద్యార్థుల సంచారం ఎక్కువగా ఉంటుంది. కాలనీ లోపల సత్తెమ్మ తల్లి గుడి ఎదురుగా ఉన్న లేఔట్, రావిచెట్టు వద్ద ఉన్న లేఔట్‌లలో రాత్రి వేళల్లో గుంపులు గుంపులుగా సంచరిస్తున్నారు. ఇటీవల రాత్రి 7 గంటల సమయంలో చిన్న పిల్లలు ఆటలాడుకుంటుండగా ఓ యువకుడు యాక్టివా మోడల్ బైక్‌పై వచ్చి ఇద్దరి పిల్లలను బ్లేడుతో గాయపరచిన సంఘటన హల్‌చల్ చేసింది. పోలీసులు శ్రద్ధ వహించి కాలనీలపై దృష్టి సారించాలని స్థానికులు కోరుతున్నారు.

మంచు సోయగం.. మనసు పరవశం!



గొల్లపుంత రోడ్డులో మంచుతో కనువిందు చేస్తున్న పంట పొలాలు

గొల్లపుంత పంట పొలాల్లో మంచు సోయగం కనువిందు చేసింది. పగటి పూట ఎండ, రాత్రి వణికిస్తున్న చలి, తెల్లారే సరికి దట్టమైన మంచుతో వారం రోజులుగా వాతావరణం విస్మయానికి గురి చేస్తోంది. ఈ నేపథ్యంలో ఆదివారం ఉదయం గొల్లపుంత రోడ్డులోని పంట క్షేత్రాలలో పొగ మంచు అలముకొని మన్యం ప్రాంతాలైన అరకు, లంబసింగిలలో ప్రకృతి అందాలను తలపించాయి. మంచు దుప్పటితో పంట పొలాల మధ్యలో కనీ కనిపించని రీతిలో పూత మీదున్న మామిడి, తాడి చెట్లతో పాటు గెలలతో కాపు మీదున్న అరటి చెట్ల అందాలు కట్టిపడేశాయి.

– మండపేట

వీణా నాదం.. పరమేశ్వరునికి ప్రీతికరం

అంబాజీపేట: వీణా నాదం పరమేశ్వరునితో పాటు సంగీత విద్వాంసులకు ఎంతో ప్రీతికరమని నెల్లూరుకు చెందిన శ్రీకంఠం నాగలక్ష్మి అన్నారు. గంగలకుర్రు అగ్రహారంలో ఉమా పార్వతీ సమేత వీరేశ్వరస్వామి, శ్రీ, భూ సమేత కేశవ స్వామి వార్ల దేవస్థాన ప్రాంగణంలో శివకేశవ యూత్ ఆధ్వర్యంలో నాగలక్ష్మితో ఆదివారం వీణ కచేరీ నిర్వహించారు. నాగలక్ష్మి మాట్లాడుతూ శ్రీహరికోటలో ఉద్యోగిగా పనిచేసినప్పటికీ సంగీతంపై ఉండే మక్కువతో ఉద్యోగానికి రాజీనామా చేసి పూర్తి వీణా సాధన చేశానన్నారు. తన భర్త మాధవరావు ప్రోత్సహించడంతో తిరుపతి, వారణాసి, తిరువనంతపురం, శ్రీశైలం తదితర పేరుగాంచిన ప్రముఖ దేవాలయాల్లో వీణా కచేరీలు నిర్వహించానన్నారు. ఏకాదశ రుద్రుల కీర్తి తెలుసుకొని ఏకాదశ రుద్రుల సన్నిధిలో వీణ కచేరీ చేయాలని నిర్వాహకులు కోరాడంతో ఈ ప్రోగ్రాం చేశానన్నారు. ఏకాదశ రుద్రులు కొలువుదీరిన ముక్కామల, ఇరుసుమండ, మొసలపల్లి, వక్కలంక, కముజువారిలంక, గంగలకుర్రు, కె.పెదపూడి తదితర శివాలయాల్లో వీణా కచేరీని నిర్వహించారు. అనంతరం నాగలక్ష్మి, మాధవరావు దంపతులను శివకేశవ యూత్, స్థానికుల ఆధ్వర్యంలో ఘనంగా సత్కరించి ఏకాదశరుద్రుల చిత్రపటాన్ని అందజేశారు.

ఘనంగా జంగిల్ పీర్‌బాబా గంధోత్సవం



చెల్లూరులో జంగిల్ పీర్ బాబా గంధోత్సవం

రాయవరం: మండలంలోని చెల్లూరు గ్రామ శివారులోని పంట పొలాల్లో వేంచేసి యున్న శ్రీ హజ్రత్ జంగిల్ పీర్ బాబా దర్గా వద్ద గంధోత్సవాన్ని ఆదివారం భక్తి శ్రద్ధలతో నిర్వహించారు. మత సామరస్యానికి ప్రతీకగా ఉన్న హజ్రత్ జంగిల్ పీర్ బాబా గంధోత్సవాన్ని బిస్మిల్లా కమిటీ ఆధ్వర్యంలో చేపట్టారు. గంధపు బిందెతో గ్రామోత్సవం నిర్వహించిన అనంతరం దర్గా వద్దకు చేరుకున్న భక్తులు గంధపు బిందెను దర్శించుకుని పూజలు చేశారు. వివిధ ప్రాంతాల నుంచి పెద్ద ఎత్తున తరలి వచ్చిన భక్తులు దర్గాను దర్శించుకుని ఫాతేహా సమర్పించి మొక్కులు చెల్లించుకున్నారు. ముస్లిం సోదరులతో పాటు హిందువులు సైతం ఉర్సుకు హాజరయ్యారు. గత 15 ఏళ్లుగా బిస్మిల్లా కమిటీ ఆధ్వర్యంలో గంధోత్సవాన్ని ఘనంగా నిర్వహిస్తున్నట్లు కమిటీ సభ్యులు తెలిపారు.

ధనమ్మ మర్రికి భక్తుల తాకిడి

కపిలేశ్వరపురం: కేదారిలంక గ్రామ శివారు వీధివారిలంకలోని ఆధ్యాత్మిక, పర్యాటక ప్రాంతమైన ధనమ్మ మర్రిని పెద్ద సంఖ్యలో భక్తులు సందర్శించారు. ఆదివారం సెలవు దినం కావడంతో విద్యార్థులు, ఉద్యోగులు, వ్యాపారులు ధనమ్మ తల్లిని దర్శించుకున్నారు. ఆడ పడుచులు మొక్కులు తీర్చుకున్నారు. గ్రామంతో పాటు కపిలేశ్వరపురం, రావులపాలెం, కొత్తపేట, కె.గంగవరం, అయినవిల్లి మండలాల్లోని భక్తులు అమ్మవారికి పూజలు చేశారు.

ఘనంగా వార్షికోత్సవ పూజలు

మామిడికుదురు: పెదపట్నంలంకలో కొలువుదీరిన శ్రీషిర్డీ సాయిబాబా ఐదో వార్షికోత్సవాన్ని పురస్కరించుకుని ఆదివారం పలు ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఉదయం కాకడ హారతితో కార్యక్రమాలు ప్రారంభమయ్యాయి. బుట్టబొమ్మలు, కేరళ వాయిద్య కళాకారుల విన్యాసాలు, మేళతాళాలతో బాబా ఉత్సవ విగ్రహాన్ని పల్లకీలో వైనతేయ గోదావరి నది వద్దకు ఊరేగింపుగా తీసుకువెళ్లారు. వైనతేయ గోదావరి నదిలో స్నానం చేయించిన అనంతరం స్వామి వారి ఉత్సవమూర్తిని ఊరేగిస్తూ ఆలయానికి తీసుకువచ్చారు. రాజోలుకు చెందిన దత్తసాయి నామార్చన సత్సంగం ఆధ్వర్యంలో నక్షత్ర మాలిక, పుష్పాభిషేకం ఘనంగా జరిగింది. దూద్ హారతి, దీపాలంకరణ, శేజ్ హారతి కార్యక్రమాలు ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి. భారీ సంఖ్యలో భక్తులు ఈ పూజల్లో పాల్గొన్నారు.

రాతి గుమ్మాల ఏర్పాటుకు పూజలు

ఆలమూరు: మండలంలోని చింతలూరులో వేంచేసిన నూకాంబిక అమ్మవారి ఆలయంలో నూతనంగా నిర్మిస్తున్న రాజగోపురంలోని రాతిగుమ్మాల ఏర్పాటుకు ప్రత్యేక పూజలు జరిగాయి. ఆలయ ఈఓ ఉండవల్లి వీర్రాజుచౌదరి ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో గ్రామానికి చెందిన వైట్ల గంగరాజు, గన్ని సూరిబాబు దంపతులు పాల్గొని పూజలు నిర్వహించారు. పరిసర ప్రాంతాల నుంచి అధిక సంఖ్యలో విచ్చేసిన భక్తులు రాతి గుమ్మాల ఏర్పాటు పూజలు అత్యంత భక్తిశ్రద్ధలతో తిలకించారు.

వైభవంగా ఆలయ ప్రతిష్ఠ

మామిడికుదురు: బి.దొడ్డవరంలో నూతనంగా నిర్మించిన ఆలయంలో ఉమా సోమేశ్వరస్వామి విగ్రహ ప్రతిష్ఠా మహోత్సవం ఆదివారం వైభవంగా జరిగింది. ఓం నమశ్శివాయ, ఓం నమశ్శివాయ అంటూ భక్తులు శివనామ స్మరణ చేస్తుండగా విగ్రహ ప్రతిష్ఠ కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. బ్రహ్మశ్రీ పూజ్యం జగన్నాథశర్మ ఆధ్వర్యంలో కంభంపాటి సుబ్రహ్మణ్యశ్రీనివాసశర్మ, పోచిరాజు వెంకటరామ నాగేశ్వరరావు, పోచిరాజు కిరణ్‌కుమార్ దంపతులు ఈ ప్రతిష్ఠ కార్యక్రమాలను దిగ్విజయంగా జరిపించారు. వేద మంత్రాలు, భక్తుల కోలాహలం నడుమ ఈ కార్యక్రమం ఆద్యంతం కన్నుల పండువలా జరిగింది. ఆలయం వద్ద భారీ అన్న సమారాధన ఏర్పాటు చేశారు.

మెగా శిబిరంలో 60 మంది రక్తదానం

మామిడికుదురు: కోనసీమ బ్లడ్ డోనర్స్ స్వచ్ఛంద సేవా సంస్థ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన మెగా రక్తదాన శిబిరంలో 60 మంది దాతలు రక్తదానం చేశారు. మామిడికుదురు డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ సామాజిక భవనంలో ఐదో వార్షికోత్సవాన్ని పురస్కరించుకుని ఈ శిబిరం ఏర్పాటు చేశారు. దాతల నుంచి సేకరించిన రక్తం తలసేమియా, రక్తహీనత కలిగిన చిన్న పిల్లలు, గర్భిణులు, ప్రమాదాల బారిన పడి ప్రాణపాయ స్థితిలో ఉన్న వారికి ఉపయోగపడుతుందని సేవా సంస్థ అధ్యక్షులు కాండ్రేగుల నరేంద్ర తెలిపారు. సంస్థ ఏర్పాటు చేసిన నాటి నుంచి నేటి వరకు ఎంతో మందికి తమ సంస్థ ద్వారా రక్తదానం చేయడం ఆనందంగా ఉందన్నారు. కార్యక్రమంలో సంస్థ ప్రతినిధులు చిట్టూరి జైకుమార్, నాగాబత్తుల ధర్మతేజ, చెల్లింగి కార్తీక్ సాయి, కంచి ప్రశాంత్ పాల్గొన్నారు.

ముకేందరస్వామికి అవార్డు

ఆలమూరు: స్థానిక అయ్యప్ప స్వామి ఆలయ కమిటీ వ్యవస్థాపక అధ్యక్షుడు ఎం.ముకేందరస్వామికి పురందర అనుగ్రహ ప్రశస్త అవార్డుకు ఎంపికయ్యారు. దాస సాహిత్య ప్రచారంలో భాగంగా విరివిగా భజన మండళ్లు ఏర్పాటు చేసినందుకు గాను టీటీడీ ఈఅవార్డుకు ఎంపిక చేసింది. ఇటీవల తిరుమలతో జరిగిన పురంధరదాసు ఆరాధనోత్సవాల్లో భాగంగా దాస సాహిత్య ప్రాజెక్టు డైరెక్టర్ పగడాల ఆనంద తీర్థాచార్యులు చేతుల మీదుగా పురంధర అనుగ్రహ ప్రశస్త అవార్డును అందుకున్నట్లు ఆలయ కమిటీ ఆదివారం తెలియజేసింది. ఆధ్యాత్మికవేత్తగా ప్రఖ్యాతి గాంచిన ముకేందరస్వామికి ఈఅవార్డు రావడం పట్ల సర్వత్రా హర్షాతిరేకాలు వ్యక్తమవుతున్నాయి.